క్లుప్తంగా

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ధర్మవరం రూరల్: ధర్మవరం మండలం దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద హైరిస్కు గర్భిణులకు వైద్య సిబ్బంది పరీక్షలను నిర్వహించారు. 34 మంది గర్భిణులు హాజరై చికిత్సలు చేయించుకున్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు.

అధికారుల అప్రమత్తతతో ఆగిన బాల్య వివాహం

పుట్టపర్తి: ఐసీడీఎస్ సిబ్బంది అప్రమత్తతతో బాల్య వివాహం ఆగింది. పుట్టపర్తి మండలం అమ్మగొండపాళ్యం గ్రామానికి చెందిన ఓ యువకుడికి బుక్కపట్నానికి చెందిన ఓ మైనర్ బాలికను ఇచ్చి ఆదివారం పెళ్లి చేసేందుకు నిశ్చయించారు. సమాచారం అందుకున్న ఐసీడీఎస్ ప్రత్యేక సూపర్‌వైజర్ కౌసల్యాసాయి సిబ్బందితో వెళ్లి యువకుడు, బాలిక తల్లిదండ్రులతో చర్చించారు. బాల్య వివాహంతో తలెత్తే అనర్థాలను వివరించి పెళ్లి జరగకుండా చర్యలు తీసుకున్నారు.

రాజీ మార్గంలో కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి రాకేష్

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీ కాదగిన 209 కేసులు పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ పేర్కొన్నారు. ఐపీసీ కేసులు 183, ఎన్‌ఐ యాక్ట్ 04, ఎంసీ కేసులు 02, ఓఎస్ 06, ఈపీ 01 బ్యాంక్ పీఎల్‌సీ 13 కలిపి మొత్తం 209 కేసులు ఉన్నాయన్నారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సీనియర్, జూనియర్ సివిల్ కోర్టులలో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 275 కేసులు పరిష్కరించినట్లు మండల న్యాయ విజ్ఞాన సదస్సు చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి, జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి, సెకండరీ మెజిస్ట్రేట్ మురళి తెలిపారు. ఏడు సివిల్ కేసులు, 18 బ్యాంకు రుణాల కేసులు, 11 బీఎస్‌ఎన్‌ఎల్ కేసులు, 13 చెక్‌బౌన్స్ కేసులు, గొడవలకు సంబంధించి 53 కేసులు, 3 ఇసుక రవాణా కేసులు, 169 గ్యాంబ్లింగ్ కేసులు, ఒక భరణం కేసు పరిష్కరించినట్లు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం



ప్రమాదానికి కారణమైన బస్సు

నల్లచెరువు: మండల పరిధిలోని దేవిరెడ్డిపల్లి వద్ద జాతీయ రహదారిపై పెను ప్రమాదం తప్పింది. మదనపల్లి వైపు నుంచి వస్తున్న లారీ దేవిరెడ్డిపల్లి ఏపీ మోడల్ స్కూల్ వద్దకు రాగానే స్పీడ్ బ్రేకర్ల వద్ద డ్రైవర్ వేగాన్ని పూర్తిగా తగ్గించాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

పట్టుచీరల తయారీ, వ్యాపారుల సంఘం కార్యాలయం ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు

ధర్మవరం: పట్టణంలో నూతనంగా నిర్మించిన పట్టుచీరల తయారీ, వ్యాపారస్తుల సంఘం నూతన కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. పట్టుచీరల వ్యాపారస్తులపై దాడులకు అడ్డుకట్ట వేయడంతోపాటు బకాయిల వసూళ్లపై పోరాడేందుకు నూతనంగా సంఘాన్ని ఏర్పాటు చేసి సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు కలవల రామ్‌కుమార్, పోలా వెంకటనారాయణ, అధ్యక్షుడు గిర్రాజు రవి, ఉపాధ్యక్షులు పోలా ప్రభాకర్, రంగం ఆది, తవిశల నాగభూషణం, కార్యదర్శి బెస్త సాంబశివ, జాయింట్ కార్యదర్శి కోటం హేమంత్‌కుమార్, నీలూరి శ్రీనివాసులు, ట్రెజరర్ కలవల మురళీధర్ పాల్గొన్నారు.

అన్నదాతల వరప్రసాదిని హంద్రీనీవా

- గాండ్లపెంట మండలానికి కృష్ణా జలాల కోసం రూ.46.44 కోట్లతో ప్రారంభం కానున్న పనులు
- ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చిన సీఎం జగన్ మోహన్ రెడ్డి
- ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

గాండ్లపెంట: సాగునీరు లేక వర్షాధారంపై ఆధారపడ్డ మండల రైతాంగానికి హంద్రీనీవా పథకం వరప్రదాయని అని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హంద్రీనీవా పథకాన్ని స్వర్గీయ వైఎస్సార్ ప్రారంభించి 90 శాతం పనులు పూర్తి చేశారన్నారు. 2012లో మిగిలిన 10 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు హంద్రీనీవా పథకాన్ని పట్టించుకోలేదన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్...హంద్రీనీవాను పూర్తి స్థాయిలో అమలులోకి తెచ్చారన్నారు. రెండో ఫేజ్ కింద పుంగనూరు బ్రాంచ్ కాలువ నుంచి చెర్లోపల్లి రిజర్వాయర్‌కు, అక్కడినుంచి కదిరి, నల్లచెరువు, తనకల్లు మండలాలకు నీరు అందజేసి ఆయా ప్రాంతాలను సస్యశ్యామలం చేసి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నారన్నారు. చంద్రబాబు పెండింగ్‌లో పెట్టిన ప్రధాన కాలువను సీఎం జగనన్న పూర్తి చేయించి తలుపుల, ఎన్‌పీకుంట మండలాలకు కృష్ణమ్మ జలాలను అందించారన్నారు. గాండ్లపెంట మండలానికి నీటి సదుపాయం లేక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లగా హంద్రీనీవా ఎత్తిపోతల పథకానికి రూ.46.44 కోట్లు మంజూరు చేయించడంతో పాటు మూడు టీఎంసీల నీటిని కేటాయించి గెజిట్‌లో నోటిఫై చేశారన్నారు. మూడు నెలల్లో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. నల్లచెరువు మండలంలోని సంజీవపల్లి వద్ద పోతున్న కాలువ నుంచి పాలపాటి దిన్నె వరకు గ్రావిటి ద్వారా నీరు తెచ్చి అక్కడ పంప్‌హౌస్ ద్వారా ఎత్తిపోతల ద్వారా సామచేనుబైలు వరకు నీటిని తరలిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అక్కడి నుంచి మూడు కాలువలు వస్తాయని, ఒక కాలువ బూరుగుపల్లి మీదుగా కోటపల్లి, కమతంపల్లి చెరువుల మీదుగా విఠరాయుని చెరువుకు, అదే విధంగా కటారుపల్లి క్రాస్ ద్వారా గాండ్లపెంట ప్రాంతానికి నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. మరో కాలువ సామచేనుబైలు నుంచి బనాన్‌చెరువుపల్లి, మలమీదపల్లి,తూపల్లి చెరువుల మీదుగా అక్కడి చెరువులను నింపి ఎన్‌పీకుంట మండలం ధనియానిచెరువు వరకు నీరు రావడం జరుగుతుందన్నారు.మరో కాలువ నల్లచెరువు మండలంలోని ఎత్తైన ప్రాంతాల్లో నున్న బి కొత్తపల్లి, అల్లుగుండు,జోగన్నపేట, నల్లచెరువు పంచాయితీకి సంబంధించిన చెరువులుకూడా నీటితో నింపుతూ దేవరచెరువు వరకు కూడా నిటితో నింపే పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

జగనన్నకు ధన్యవాదాలు తెలిపేందుకు నేడు ర్యాలీ

గాండ్లపెంటకు కృష్ణా జలాలు కేటాయిస్తూ దశాబ్దాల నాటి రైతుల కలను నేరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకు ధన్యవాదాలు తెలుపుతూ ఆదివారం ఉదయం 9 గంటలకు పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయం నుంచి గాండ్లపెంట వైఎస్సార్ విగ్రహం వరకు ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే సిద్దారెడ్డి తెలిపారు. రైతులు, వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ తాతం జగనోహ్మన్, సర్పంచ్ రహంతుల్లా, నాగభూషణంరెడ్డి, బూక్యారవీంద్రారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఎస్పీహైదర్‌వలీ, జేసీఎస్ కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, బీసీ కన్వీనర్ జక్కల నరసింహాగౌడ్, ఆర్బీకే చైర్మన్ శంకర్‌నాయుడు, రాష్ట్ర బీసీ డైరెక్టర్ ధనుంజయ పాల్గొన్నారు.

సరైన సాక్ష్యాలతోనే చంద్రబాబు అరెస్ట్

- ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి

గాండ్లపెంట: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో ప్రధాన ముద్దాయి ఏ-1 చంద్రబాబేనని ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జర్మనీ సీమెన్స్ సంస్థకు తెలియకుండానే బాబు బృందం లోపాయికారిగా ఒప్పందం కుదుర్చుకుని షెల్ కంపెనీల ద్వారా రూ.371 కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసిందన్నారు. ఈ అవినీతి వ్యవహారంపై సీఐడీ విచారణ జరిపి సాక్ష్యాధారాలతో బాబుని అరెస్ట్ చేసిందన్నారు. అదేవిధంగా పేదల ఇళ్లకు సంబంధించి షెల్ కంపెనీల ద్వారా రూ.128 కోట్లను అక్రమంగా సంపాదించిన కేసులో చంద్రబాబుకు ఆదాయపన్నుశాఖ కూడా నోటీసులు జారీ చేసిందని గుర్తు చేశారు. రాజధాని భూసేకరణలోనూ, విజయవాడ రింగ్‌రోడ్ అలైన్‌మెంట్, అసైన్‌మెంట్ భూముల ద్వారా చంద్రబాబు అక్రమంగా వేల కోట్లు సంపాదించారని విమర్శించారు. ఈ రెండు స్కామ్‌లతోపాటు అనేక కుంభకోణాల్లో చంద్రబాబు పాత్ర ఉందన్నారు. చంద్రబాబు ఎప్పుడు మాట్లాడినా నన్ను ఎవరూ పట్టుకోలేరు, నన్ను ఎవరూ కనుక్కోలేరు,నేను ఎవరికీ దొరకను అని చెప్తాడే తప్ప.. నేను తప్పు చేయలేదు అని ఏరోజూ ఆయన నోటి నుంచి మాటరాదన్నారు. చేసిన తప్పుకు ఈరోజు అడ్డంగా దొరికిపోయి జైలుకు పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో రాష్ట్ర ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. చంద్రబాబుకు మద్దతు ఇస్తున్న పవన్ కళ్యాణ్, తోక పార్టీలు సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అవినీతి వ్యవహారంలో పాత్ర ఉన్న చంద్రబాబు తనయుడు లోకేష్‌ను సైతం అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తోందన్నారు. చంద్రబాబు లూటీ చేసిన ప్రజాధనాన్ని కక్కించాలన్నారు.

చంద్రబాబు అరెస్ట్ సమంజసమే

అమడగూరు: ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడం సంమజసమేనని ఎంపీపీ గజ్జల ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్కిల్డ్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకోవడంపై పక్కా ఆధారాలతోనే సీఐడీ అధికారులు చంద్రబాబును అరెస్ట్ చేశారన్నారు. అయితే చంద్రబాబు అరెస్ట్‌పై టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు నానా యాగీ చేస్తున్నారని తప్పుబట్టారు. రాష్ట్ర ప్రజల కోసం ఎందాకైనా పోరాడుతానన్న చంద్రబాబు, ఆయన సతీమణి మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. రాజకీయ లబ్ది కోసం, రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. అవినీతి, అక్రమాలు చేసేవారు ఎప్పటికైనా శిక్షార్హులు కాకుండా తప్పించుకోలేరన్నారు.

వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబు దిట్ట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- ఎమ్మెల్యేదుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును స్వాగతిస్తున్నామని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన నల్లమాడ మండలం నల్లసింగయ్యగారిపల్లిలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో పూర్తిగా కూరుకుపోయారన్నారు. ఆయన కూడా తెలిసే బెయిల్ కోసం ప్రయత్నించలేదని చెప్పారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబు దిట్ట.. కానీ పక్కా ఆధారాలతో బుక్ కావడంతోనే మౌనంగా ఉన్నారన్నారు. ఏదైనా టెండరులో ఒకటి, ఒకటిన్నర లేదా రెండు శాతం కన్సల్టెన్సీ ఫీజుగా తీసుకుంటారని.. కానీ చంద్రబాబునాయుడు ఏకంగా 10 శాతం కన్సల్టెన్సీ ఛార్జ్ చేసి రూ.371 కోట్లు డ్రా చేశారని మండిపడ్డారు. టిడ్కో ఇళ్లలో కూడా చంద్రబాబు భారీ కుంభకోణాలు చేశారన్నారు.

చంద్రబాబుకే ఇచ్చామన్న 'షాపూర్జీ'

సబ్ కాంట్రాక్టర్ల ద్వారా రూ.370 కోట్లు డ్రా చేసి చంద్రబాబుకు ఇచ్చామని షాపూర్జీ సంస్థ వెల్లడించిందని, స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ప్రభుత్వంలో ఐటీ శాఖ మంత్రిగా పని చేసిన పల్లె రఘునాథ రెడ్డి పాత్ర ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. పల్లె రఘునాథ రెడ్డిని కూడా విచారణ చేయాలని సీఐడీని శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు.

బాబు జేబులోకే..

స్కిల్ డెవలప్‌మెంట్ ముసుగులో సీమెన్స్ కంపెనీతో ఓ ప్రాజెక్టుకి రూ.3,356 కోట్లతో చంద్రబాబు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 90 శాతం సీమెన్స్ పెట్టుబడి, 10 శాతం ప్రభుత్వం పెట్టబోతున్నట్లు ప్రచారం చేసుకున్నారని శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. కానీ.. సీమెన్స్ మాత్రం ఒక్క పైసా కూడా పెట్టుబడి పెట్టలేదని చెప్పారు. అయితే.. చంద్రబాబు మాత్రం అధికారులపై ఒత్తిడి తెచ్చి జీఎస్టీతో కలిపి రూ.371 కోట్లని విడుదల చేయించారని తెలిపారు. ఆ తర్వాత ఆ డబ్బును షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు అండ్ గ్యాంగ్ జేబుల్లోకి వెళ్లిందన్నారు. ఈ అవినీతిపై విచారణ జరిపిన సీఐడీ సాక్ష్యాధారాలతో బాబుని అరెస్ట్ చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు.

ఆర్యవైశ్య మహిళా మండలి నూతన కార్యవర్గం

కదిరి టౌన్: కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం ఆర్యవైశ్య మహిళా మండలి నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షురాలిగా పచ్చిపులుసు కవిత, కోశాధికారిగా సత్రశాల శాంత లక్ష్మి, అంబటి శోభా దేవితో పాటు 60 మంది సభ్యులను ఎంపిక చేశారు.

సాధన క్రికెట్ క్లబ్ ఏర్పాటు

కదిరి అర్బన్: కదిరి ప్రాంతంలో ఔత్సాహిక క్రికెట్ క్రీడాకారులను ప్రొత్సహించేందుకు పట్టణంలోని సాధన ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సాధన క్రికెట్ క్లబ్‌ను శనివారం క్లబ్ ప్రెసిడెంట్ సాధిక్‌బాషా ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు జెర్సీలను అందజేశారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి తదితరులు

గాండ్లపెంట: మండల కేంద్రంతో పాటు, ఎలుగూటివారిపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీకి చెందిన 13 కుటుంబాలు శనివారం ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీలో చేరాయి. ఆయా కుటుంబాలకు చెందినవారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం జగనన్న పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. తాము కూడా సంక్షేమ పథకాలు అందుకున్నామన్నారు. పార్టీలో చేరిన వారిలో ఆత్మానందరెడ్డి, లక్ష్మిరెడ్డి, వెంకటరెడ్డి, రాజారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, ఇలియాజ్, ఆనంద్, ఆంజనేయులు, మణికంత, ఉత్తప్ప, గంగులప్ప తదితరులు ఉన్నారు.

స్వామివార్లకు శ్రావణమాస పూజలు



ఆంజనేయస్వామికి పూజలు



తులసిమాలల అలంకరణలో వేంకటేశ్వరస్వామి



ధర్మవరంలో ఏడు శనివారాల వ్రతం చేస్తున్న మహిళలు

కదిరి టౌన్: శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా భక్తులు ఆలయాలకు పోటెత్తారు. పట్టణంలోని శ్రీఖాద్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయం, సైదాపురం అంజనేయస్వామి ఆలయం, పంచముఖ అంజనేయస్వామి, ద్వారక అంజనేయ స్వామి, అభయాంజనేయస్వామి ఆలయాల్లో స్వామివార్లకు విశేష అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నల్లచెరువు: మండలంలో ప్రసిద్ధి చెందిన శ్రీ పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వివిధ మండలాల నుండి భక్తులు భారీ సంఖ్యలో హాజరై ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

తలుపుల: గంజివారిపల్లి గ్రామంలో నూతనంగా ప్రతిష్టించిన అభయ ఆంజనేయస్వామి, బట్రేపల్లి రోడ్డులో కొలువైన ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు, అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఎన్‌పీకుంట: మండల కేంద్రంతో పాటు పెడబల్లి, ధనియానిచెరువు, వెలిచలమల గ్రామాల్లోని అభయాంజనేయ స్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. స్వామివార్లను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పెడబల్లి గ్రామంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం

ధర్మవరం అర్బన్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోనున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళలతో ఏడు శనివారాల వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌ను అర్చకులు రాజేష్ వివిధ రకాల పూలు, తులసిమాలలు, పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టి జగదీష్, కార్యదర్శి జింకా రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

బత్తలపల్లి: శ్రావణమాసం ఆఖరి శనివారం కావడంతో ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పోట్లమర్రి ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించి భజనలు చేశారు. యల్లమ్మ, పెద్దమ్మ, గంటాపురంలోని మారెమ్మ, బత్తలపల్లిలోని బళ్లారి దుర్గమ్మ, గంగమ్మ, మహాలక్ష్మీ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



ప్రత్యేక అలంకరణలో శ్రీ పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి



పోట్లమర్రి ఆంజనేయస్వామికి ఆకుపూజ



ఖాద్రీశుని ఆలయంలో భక్తుల క్యూ

శ్రీకృష్ణుని ప్రతిమ ఊరేగింపు



ధర్మవరంలో పూల పల్లకీపై శ్రీకృష్ణుని ఊరేగిస్తున్న భక్తులు

ధర్మవరం అర్బన్: ధర్మవరంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ప్రతిమను శనివారం పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. పలువురు చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు.

తాడిమర్రి: కృష్ణాష్టమిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో శనివారం భగవాన్ శ్రీకృష్ణుని ప్రతిమను వైభవంగా ఊరేగించారు. ప్రబోధ సేవాసమితి-జ్ఞానవేదిక తాడిమర్రి శాఖ ఆధ్వర్యంలో వీరభద్రయ్యస్వామి దేవాలయ ఆవరణలో ప్రత్యేక మండపం ఏర్పాటు చేసి శ్రీకృష్ణుని ప్రతిమను కొలువుతీర్చి మూడు రోజులుగా ప్రత్యేక పూజలు చేశారు. శనివారం స్వామి ప్రతిమను గ్రామ వీధుల్లో డప్పులు వాయిద్యాలు, మేలతాళాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కీలు గుర్రాలు భక్తులను ఆకట్టు కున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దేవునికి కొబ్బరి కాయలను సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. డీఆర్ నరసింహులు, లక్ష్మీనారాయణ, నరసమ్మ, రాముడు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అండగా ఉందాం

- ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి




నూతన కమిటీని అభినందిస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

తలుపుల: సీఎం వైఎస్ జగన్ విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని, ప్రభుత్వానికి అండగా ఉందామని కృష్ణ, గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సీ టి.కల్పలతారెడ్డి సూచించారు. నంగివాండ్లపల్లి గ్రామంలోని ఎమ్మెల్సీ స్వగృహంలో శనివారం వైఎస్సార్‌టీఎఫ్ మండల కమిటీని ఎంపిక చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎలాంటి సమస్య ఉన్నా పరిష్కారానికి సమష్టిగా పనిచేయాలన్నారు. సంఘం మండల అధ్యక్షురాలిగా జేడీ వనలత, ప్రధాన కార్యదర్శిగా సునీల్‌కుమార్, కోశాధికారిగా భూదేవి, గౌరవాధ్యక్షుడిగా బయారెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్‌గా హరినాథరెడ్డి, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ యూనస్, పాండురంగారెడ్డి, సుభహాన్, శ్రీరాములు, రామమోహన్‌రెడ్డి తదితర కార్యదర్శులు, కౌన్సిలర్లను ఎన్నుకున్నారు. సమావేశంలో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పుల్లారెడ్డి, రాష్ట్ర నాయకులు జంషీద్, జిలా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ పక్కాగా నిర్వహించాలి

తనకల్లు: ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీని పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ పూల నరసింహులు, ఎస్‌ఆర్‌సీ కాంతయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉపాధిహామీ సిబ్బంది, సామాజిక తనిఖీ సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 2022-23 ఆర్థిక సంవత్సరానికి చేపట్టిన ఉపాధి హామీ పనులు, కూలీల వేతనాలపై ఆయా గ్రామాలలో సామాజిక తనిఖీ బృందం వివరాలను సేకరించనున్నట్లు తెలిపారు. ఈ నెల 19న సోషల్ ఆడిట్ నివేదికను బహిరంగ పరుస్తామన్నారు. కార్యక్రమంలో ఈసీ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ



నల్లచెరువు: మండలపరిధిలోని శ్రీ పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి వారిని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం దుశ్శాలువాతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.